నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 4 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శ్రీనగర్ కాలనీ, బొక్కలగడ్డ, లష్కర్‌బజార్, కుమార్‌పల్లి ప్రాంతాల్లో, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, చైతన్యపురి కాలనీ, టీచర్స్‌కాలనీ ఫేస్ -2, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, ఎల్ఐసీ ఆఫీసు రోడ్డు, ఏకశిల పార్కు రోడ్డు, బాలసముద్రం, అలాగే మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30వరకు భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్, వికాస్‌నగర్, అశోక్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు షురూ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 4 : కాకతీయ విశ్వవిద్యాలయ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షలను రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పరిశీలించారు.

ఆర్ట్స్ కళాశాలలో పేదరిక నిర్మూలనపై సదస్సు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 4 : కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ వారి ఆర్థిక సహాయంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేదరిక నిర్మూలన కోసం మిషన్(ఎంఈపీఎంఏ) సారధ్యంలో స్మైల్ ప్రాజెక్ట్ సర్వే కార్యక్రమం సోమవారం ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెడ్, సర్వే ప్రధాన పరిశోధన అధికారి శ్రీనివాస్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు సుభాష్, సాహితి, శ్రవణ్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పుల్ల రమేశ్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించాలి

పరకాల, నవంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనలో సమగ్ర సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో సేకరించాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మ పేర్కొన్నారు. సర్వే చేపట్టే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఈ సర్వేలో ఎలాంటి తప్పులకు తావియ్యొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రమాదేవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **CHANDRAMATHI DEVI IDULAPURAM** (Old Name) W/o **BOLLOJU VENKATESHWARLU** R/o H.No. 6-8-76, Brahmanawada, Hanamkonda, Hanumakonda Dist., TG., India Pin-506001 declare that I changed my name from **CHANDRAMATHI DEVI IDULAPURAM** (Old Name) to **PAVANI CHANDRAMATHI DEVI BOLLOJU** (New Name) and solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నయీంనగర్ : బ్రహ్మోత్సవంలో మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

పరకాల : అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

మడికొండ : మెట్టుగుట్టపై పూజలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు

వరంగల్ : రాజరాజేశ్వరాలయం వద్ద రామ యంత్రానికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆలయాల్లో 'కార్తీక' సందడి

హనుమకొండ చౌరస్తా/నయీంనగర్/హనుమకొండ/వరంగల్/మడికొండ/పరకాల, నవంబర్ 4 : కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మొదటి సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఉత్తిష్ఠగణపతికి పంచామృతాభిషేకం రుద్రేశ్వర స్వామి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంకీర్తనలు నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అయోధ్యలో ప్రతిష్ఠాపన కోసం కంచి నుంచి 180 కిలోల పంచలోహ బంగారం తాపడం కలిగిన శ్రీరామ యంత్రం తీసుకెళ్లే రథం ఆలయం వద్దకు రాగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి యంత్రదర్శనం చేసుకున్నారు. రాజరాజేశ్వరి దేవాలయం వద్ద కూడా రథానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో యజ్ఞం పవన్‌కుమార్‌శర్మ, పెండ్యాల సందీప్‌శర్మ, వెంకట్, వేదపండితులు గంగు మణికంఠశర్మ పాల్గొన్నారు. నేడు మంగళవారం దేవాలయ ప్రాంగణంలో నాగులచవితి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు తెలిపారు. కాగా, వడ్డేపల్లి ఎన్జీవోస్ కాలనీలోని భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వాసుదేవాచార్యులు పాల్గొన్నారు. పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకుడు సిద్ధేశుని సురేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం ఐదు రకాల పూలు, రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించినట్లు పేర్కొన్నారు. కాగా, మడికొండలోని మెట్టుగుట్ట ఆలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్నారు. శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు. పరకాలలోని భవానీ కుంకుమేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి, గురిజపల్లి ప్రకాశ్‌రావు, చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పంచగిరి శ్రీనివాస్, శనిగరపు నవీన్, గంట కళావతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిర్బంధ పాలన

పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

పరకాల, నవంబర్ 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తున్నదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన ర్యాలీకి హాజరవుతారనే నెపంతో నడికూడ, పరకాల మండలాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లుల కోసం పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన చెందారు. రూ.లక్షలు అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన తమను ఉగ్రవాదుల్లాగా రాత్రికి రాత్రి పోలీస్ స్టేషన్‌కు తరలించడమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో తిప్పర్తి సాంబశివారెడ్డి, ఊర రవీందర్, రవీందర్, రాజయ్య, శ్రీనివాస్, సురేశ్ ఉన్నారు.

బైక్ దొంగ అరెస్టు

నయీంనగర్, నవంబర్ 4 : బైక్ దొంగతనాలను పాల్పడుతున్న వ్యక్తిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సతీశ్ కథనం ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్ రహమత్‌పురకు చెందిన మహ్మద్ వసీం తనకు వచ్చే జీతం సరిపోక బైక్‌లను దొంగిలించడం మొదలుపెట్టాడు. వాటిని తక్కువ ధరకు అమ్మి వచ్చే డబ్బులతో జల్సాలు చేసేవాడు. సోమవారం అలంకార్ జంక్షన్ వద్ద బైక్ కన్సల్టెన్సీలకు గుర్తు తెలియని వ్యక్తి తక్కువ ధరకు బైక్‌లు అమ్ముతున్నాడని వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా నిందితుడు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. మూడు హోండా యాక్టివాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై పలు స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన లారీ

ఆత్మకూరు, నవంబర్ 4 : జాతీయ రహదారిపై గూడెప్పాడ్ శివారులో లారీ అదుపు తప్పి సోమవారం కాల్వలోకి దూసుకెళ్లింది. బయ్యారం నుంచి హనుమకొండకు ఫ్లై యాష్ లోడుతో వెళ్తున్న లారీ బురద కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఐనవోలు, నవంబర్ 4 : నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కక్కిరాలపల్లి శివారులో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. పోచమ్మగుడి పక్కన పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1910, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

కాజీపేట, నవంబర్ 4 : పట్టణంలోని రహమత్ నగర్‌కు చెందిన రిటైర్డ్ కార్మికుడు కొరివి కృష్ణారావు (75) కాజీపేట స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

కమిషనర్ సార్.. నా బిడ్డను కాపాడాలి..

కమిషనరేట్ ఎదుట బాధితురాలు

నయీంనగర్, నవంబర్ 4 : పోలీసు కమిషనర్ సార్ మీరే నా బిడ్డను కాపాడాలి అంటూ తల్లిదండ్రులు తమ ఆవేదనను 'నమస్తే తెలంగాణ'తో చెప్పుకున్నారు. ఖిలావరంగల్‌కు చెందిన కానవేని ప్రసాద్‌కు ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురుకు 10సంవత్సరాల నుంచి ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లిదండ్రులే ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. దీంతో ప్రసాద్ తన ఇల్లును అమ్మి కూతురికి వైద్యం చేయించేందుకు చూస్తుండగా కొడుకు రాజేశ్ వినకుండా తన బిడ్డను చంపుకో.. అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నాడని బాధితులు తెలిపారు. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నప్పుడు డబ్బులు ఇస్తానని చెప్పి మూడేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. సోమవారం సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిసిన ఆమె తల్లిదండ్రులు మూడు సంవత్సరాలుగా మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. మీరే న్యాయం చేయాలని వేడుకున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన మిల్స్‌కాలనీ సీఐకి ఫోన్ చేసినట్లు చెప్పారు.

'పునర్వినియోగం అలవాటు చేసుకోవాలి'

బహుమతులను ప్రదానం చేస్తున్న డీఈవో

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 4 : ఒకసారి ఉపయోగించిన వివిధ రకాల వస్తువులను సృజనాత్మకతతో ఆలోచించి వాటిని మరో రకంగా ఉపయోగిస్తే పర్యావరణాన్ని కొంతమేర పరిరక్షించుకోవచ్చని డీఈవో వాసంతి అన్నారు. సోమవారం హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'వేస్ట్ టు వెల్త్' భావనపై 'ఎకో క్లబ్' పాఠశాలల విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల అలంకరణ సామగ్రిని ఆమె పరిశీలించారు. జిల్లాలోని 54 పాఠశాలల నుంచి వివిధ కళాత్మక వస్తువులతో పాల్గొన్న 108 మంది విద్యార్థులను అభినందించారు. ఎన్జీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, ఇన్‌చార్జి హెచ్ఎం వాణి, సుధాకర్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల ఎల్కతుర్తి విద్యార్థినులు వైష్ణవి, పలిమా ప్రథమ బహుమతి, జడ్పీ ఉన్నత పాఠశాల భీమారం విద్యార్థినులు శ్రీజ, శివాని ద్వితీయ బహుమతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హనుమకొండ విద్యార్థులు సాయినితిన్, అనుపమ్, అన్సార్ పాఠశాల విద్యార్థులు అల్కమ షమీం, మహ్మద్ ఫర్హాన్ సంయుక్తంగా తృతీయ బహుమతి అందుకున్నారు.

రేపు గోకుల్‌నగర్‌లో సదర్ సమ్మేళన్

మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ, నవంబర్ 4 : యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బుధవారం గోకుల్ సదర్ సమ్మేళన్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, గిరిబోయిన రాజయ్య యాదవ్, బంక సంపత్ యాదవ్, మూగల కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం గోకుల్ జంక్షన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు హైదరాబాద్ వరకే పరిమితమైన ఈ సదర్ ఉత్సవం మొదటి సారి హనుమకొండ నగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవంలో ముఖ్యంగా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆట, పాటలు, నృత్యాలను ప్రదర్శించడంతో పాటు దున్నపోతుల విన్యాసాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు హనుమకొండ పాత బస్‌డిపో ఎదుట జరిగే ఉత్సవానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు పార్టీలకతీతంగా యాదవులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ నేతలు సిద్ది రాజు యాదవ్, బంక సతీశ్, ఎల్లావుల రాజేందర్, బొంగు రాజు, సత్యం యాదవ్ పాల్గొన్నారు.

కాజీపేటలో పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట : నగరంలోని గోకుల్ నగర్‌లో నిర్వహించే సదర్ సమ్మేళనాన్ని యాదవ కులస్తులు విజయవంతం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాజీపేట విష్ణుపురి పంచముఖాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సదర్ సమ్మేళన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా అశోక్, మేషబోయిన కుమార్, దేవనబోయిన సాంబయ్య, బొల్ల మురళి, ఆవుల రాజేశ్, గంప రమేశ్, జక్కుల నవీన్, కొండ శివ, బక్కతట్ల టింకు పాల్గొన్నారు.

వెలవెలబోయిన బల్దియా గ్రీవెన్స్

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల పైనే ఫిర్యాదులు

వరంగల్,నవంబర్ 4 : బల్దియా గ్రీవెన్స్ వెలవెలపోయింది. కమిషనర్, వింగ్ అధికారులు రాకపోవడంతో బాధితులు అర్జీలు ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ఉన్నతాధికారులకు వినతులు అందిస్తేనే పరిష్కారం కావడం లేదని, అలాంటప్పుడు కింది స్థాయి అధికారులకు ఇస్తే లాభమేంటని వారు వెనుదిరిగారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా అర్జీలను స్వీకరించారు. 31వ డివిజన్ హంటర్ రోడ్డులోని సాయినగర్ కాలనీలో కొంతమంది 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించారని దీనిపై చర్యలు తీసుకోవాలని సంగెపు స్వామి ఫిర్యాదు చేశారు. వరంగల్ జేపీఎన్ రోడ్డులోని నిర్మలా మాల్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయని, కాంప్లెక్సులోని వారంతా డెంగ్యూ బారిన పడుతున్నారని, వెంటనే ఫాగింగ్ చేయాలని కాంప్లెక్స్ సూపర్‌వైజర్ భవానీ వినతిపత్రం అందజేశారు. 66వ డివిజన్ చింతగట్టు గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని రంజిత్ కుమార్ విన్నవించారు. 18వ డివిజన్ లక్ష్మీపురం శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని పోలెపాక సీతయ్య వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్‌లో 46 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 24, ఇంజినీరింగ్ విభాగం 10, ప్రజారోగ్య విభాగం 6, పన్నుల విభాగం 5, తాగునీటి సరఫరాపై ఒక వినతి వచ్చింది. గ్రీవెన్స్‌లో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణారెడ్డి, ప్రసన్న రాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన పెంచాలి : డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్, నవంబర్ 4 : లింగ నిర్ధారణ, ఆడపిల్లలపై వివక్షతపై ప్రభుత్వ విభాగాలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు. సోమవారం తన కార్యాలయంలో జిల్లా స్థాయి లింగ నిర్ధారణ చట్టంపై అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనల ప్రకారం పరీక్షలు చేయాలన్నారు. లింగనిర్ధారణ కోసం వచ్చే వారి వివరాలను తమకు తెలుపాలని సూచించారు. కాగా, పీహెచ్‌సీలు, పల్లె దవాఖానల సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. సమావేశంలో జీఎంహెచ్ ప్రొఫెసర్ రాజేశ్వరి, అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమార్, డాక్టర్ నాగరాజు, కవిత, సామాజిక కార్యకర్త రేవతి, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్, క్షయ నియంత్రణ అధికారి హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇఫ్తాకర్, ఎస్‌వో ప్రసన్నకుమార్, డీపీవో శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

హనుమకొండ, నవంబర్ 4 : పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫోరంలో జిల్లా నుంచి అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీగా బీ వెంకన్న, కార్యవర్గ సభ్యుడిగా అర్షం శ్రీను ఎంపిక కాగా, సోమవారం టీఎన్జీవోస్ భవన్‌లో వారిని సన్మానించారు. ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రాష్ట్ర నేత శ్యామ్‌సుందర్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, ఎంపీవో గోపు రఘుపతిరెడ్డి, కార్యదర్శుల సంఘం జిల్లా నేత అశోక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దామెర, నవంబర్ 4 : ఊరుగొండ శివారులోని ఎంపీజే గురుకుల పాఠశాల (పెద్దాపురం)లో సోమవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ దామెర అనిత అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఎస్సై రమేశ్ పాల్గొని అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుళ్లు దాసరి నాయక్, సురేశ్, కానిస్టేబుళ్లు రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వర్గీకరణ కాకపోతే పదవికి రాజీనామా చేస్తా

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్

హసన్‌పర్తి, నవంబర్ 4 : మాదిగల వర్గీకరణ కాకపోతే పదవికి రాజీనామ చేస్తానని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. చింతగట్టు సమీపంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నమిడ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సంపత్‌కుమార్, ఎంపీ కడియం కావ్య, ప్రభుత్వ చీఫ్ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కంబంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, ఓయూ ప్రొఫెసర్ కాసిం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఈ నెల 15న జరుగనున్న మాదిగల మేల్కొలుపు ర్యాలీని జయప్రదం చేసేందుకు మాదిగ, మాదిగ ఉపకులాలు పాటుపడాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, నాయకులు పుట్ట రవి, బోడ యుగేంధర్, రాజారపు భిక్షపతి, మేకల రమేశ్ పాల్గొన్నారు.

తైక్వాండో జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 4 : బుధవారం నుంచి 9 వరకు అమృత్‌సర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ తైక్వాండో(పురుషుల) జట్టును ఎంపిక చేసినట్లు కేయూ క్రీడా కార్యదర్శి వెంకయ్య తెలిపారు. మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ నుంచి కే కిరణ్, సమైక్య డిగ్రీ కాలేజీ నుంచి కే అఖిలేష్, హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కాలేజీ నుంచి టీ మోహన్‌కృష్ణ, కేడీసీ నుంచి టీ నవీన్, ఎం రాజేశ్ జట్టులో ఉన్నట్లు చెప్పారు. వీరికి మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ వ్యాయామ కళాశాల అధ్యాపకుడు కే రమేశ్ కోచ్ అండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

రేపటి నుంచి శివాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబైన శివాలయం

ఆత్మకూరు, నవంబర్ 4 : మహాదేవ పంచలింగాల శివాలయ ప్రతిష్ఠాపన కుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 6,7,8 తేదీల్లో అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరులోని శివాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ..శివాలయ నిర్మాణానికి గ్రామంతో పాటు కామారం, తిరుమలగిరి, చౌళ్లపల్లి, గూడెప్పాడ్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ నగరాలకు చెందిన వారు సైతం భారీగా విరాళాలు ఇచ్చారన్నారు. మూడు రోజుల పాటు గ్రామంలో అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, ఆలయ కమిటీ సభ్యులు తోట రఘు, సిరపురపు సంపత్, బూర కిశోర్, బాషబోయిన సాగర్, మందల తిరుపతి, ఉప్పుల సుదర్శన్, రేవూరి దేవేందర్‌రెడ్డి, జలేందర్‌రెడ్డి, తోట కుమారస్వామి, సిరపురపు తిరుపతి, అర్చకులు రవీందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన పంచలింగాల శివాలయం

కాకతీయుల కాలంలో పంచలింగాల శివాలయాన్ని నిర్మించారు. ఆలయం కాలక్రమేణా జీర్ణావస్థకు చేరుకుంది. వరంగల్ జాన్ సరస్వతి పీఠాధిపతి పవన్ కుమార్ శర్మ దేవాలయాన్ని సందర్శించారు. ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలంటే ముందుగా శివపార్వతుల కల్యాణం నిర్వహించాలని గ్రామస్తులకు సూచించారు. దీంతో గ్రామస్తులంతా చేయి చేయి కలిపారు. వెయ్యేళ్ల ఆలయానికి జీర్ణోద్ధరణ చేశార